పీడిత ప్రజల గొంతుక సీపీఐ

● శతాబ్ది ఉత్సవాల్లో సీపీఐ సీనియర్ నాయకురాలు ప్రేం పావని

సికింద్రాబాద్, డిసెంబర్ 29: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలను సికింద్రాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం ముందు జరిగిన కార్యక్రమానికి ఆపార్టీ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకురాలు ప్రేం పావని శతాబ్ది ఉత్సవాల జండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోరాటాలే ఊపిరిగా ఈ దేశంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచిందని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలను కొనసాగిస్తున్న పార్టీ కేవలం సీపీఐ మాత్రమేనని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమం మొదలుకొని, తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని వేలాది కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సీపీఐదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పీడిత తాడిత ప్రజల వైపు నిలబడుతున్న పార్టీ కేవలం సీపీఐ మాత్రమేనని కొనియాడారు. పోరాట త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ప్రజా సంక్షేమ కోసం జరిగే పోరాటంలో కార్యకర్తలంతా భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గణేశ్, సాయి ఆట పాటలతో శ్రేణులను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, జోగు రాములు, శ్రీహరి, యాదగిరి, రాజు, పద్మ, నాగమణి, రూప, వెంకటేశ్, మహేశ్, జెల్ల కొండలు, యాకయ్య, యాకోబు, హుస్సేన్, పంగ శీను తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి చౌరస్తాలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయరత్న అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, డిసెంబర్ 29: సావిత్రిబాయిపూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. భారత మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిని సావిత్రిబాయి పూలే అని అన్నారు. జనవరి 3న ఆమె జయంతితోపాటు మహోతన్నతమైన ఆధ్యాత్మిక తత్వవేత్త స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులకు సమాజ సేవకులకు ఇతర రంగాల ప్రముఖులకు సావిత్రిబాయిపూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డులను జనవరి 12న ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. జనవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, డిసెంబర్ 29: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ హార్రాస్‌పెంటా, రాంనగర్, నెహ్రూనగర్, సుందర్‌నగర్, మౌలానా ఆజాద్ నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సోమవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు హార్రాస్‌పెంటా, రాంనగర్ ఫీడర్ పరిధిలోని హార్రాస్‌పెంటా, సుందర్‌నగర్, శ్యామ్‌నగర్, క్రిమిటోరియం, గాస్‌మండి, రాంనగర్, శ్రీనివాస టెక్స్‌టైల్స్, ఈసేవా, ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. ఉదయం 11.30 నుంచి 1.30 గంట వరకు నెహ్రూనగర్, సుందర్‌నగర్ ఫీడర్ల పరిధిలోని నెహ్రూనగర్, క్రిష్ణనగర్, గోల్నాక చర్చి, సుందర్‌నగర్, క్రిష్ణనగర్, బోన్ ఫ్యాక్టరీ, కాచిగూడ కమేళా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మౌలానా ఆజాద్‌నగర్ ఫీడర్ పరిధిలోని చెప్పల్‌బజార్, కుమార్ థియేటర్, రహమత్‌బాగ్, క్వాలిగార్డెన్ అపార్టుమెంట్, పన్నాలాల్ బిల్డింగ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్, డిసెంబర్ 29: విద్యుత్ కేబుళ్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపుతో పాటు ఇతర పనుల కారణంగా సోమవారం బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సబ్ డివిజన్ ఏడీఈ గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్ఐసీ కాలనీ, బ్రైట్ కాలనీ, ఉషా ఎన్‌క్లేవ్, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 సబ్ స్టేషన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7, 14, యానిమల్ కేర్ క్లినిక్, రోడ్డు నంబర్ 4, ఉడిపి హోటల్, డీల్లీ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు కరెంట్ సరఫరా ఉండ దు. యూసుఫ్‌గూడ సబ్ స్టేషన్ పరిధిలోని పెద్ద మజీద్, కృష్ణా నగర్ సీ-బ్లాక్ , బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 సబ్ స్టేషన్ పరిధిలోని అరోరా కాలనీ, బాలాజీ అపార్ట్‌మెంట్, పెట్రోల్ పంప్. రోడ్ నంబర్ 3 తదితర ప్రాం తాల్లో మధ్యాహ్నం 2 నుంచి మ ధ్యాహ్నం సాయం త్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

హోంగార్డుపై దాడి

కాచిగూడ, డిసెంబర్ 29: రైల్వేస్టేషన్‌లో హోంగార్డుపై గుర్తుతెలియని వ్యక్తి దాడిచేసిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ యల్లప్ప తెలిపిన వివరాల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ ప్రాంతానికి చెందిన నర్సన్న కుమారుడు జెంభన్న (36)కాచిగూడ ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు. యాకుత్‌పుర రైల్వేస్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి ఇక్కడేమి పని అని హోంగార్డు అడుగగా గుర్తుతెలియని వ్యక్తి హోంగార్డు తలపై రాయితో కొట్టి పారిపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపారు.

ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలి

తైక్వాండో పోటీలను తిలకిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 29: విద్యార్థులను తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం ముషీరాబాద్ గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్-2024 పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బాలబాలికలు విద్యతోపాటు క్రీడా రంగాల్లో రాణించాల్సిన అవరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో క్రీడా పోటీల నిర్వాహకులు రాకేశ్, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, ఎయిర్‌టెల్ రాజు, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, బల్వంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

సమావేశంలో మాట్లాడుతూ వేముల వెంకటేశ్

చిక్కడపల్లి, డిసెంబర్ 29: వడ్డెరల ఆరాధ్యుడైన వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను జనవరి 11న రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవాల కమిటీ చైర్మన్ వేముల వెంకటేశ్ తెలిపారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఓబన్న ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహణ కోసం రాష్ట్రంలోని వడ్డెర సంఘాల ప్రతినిధులతో ఉత్సవాల జేఏసీ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరు కానున్నట్లు తెలిపారు. 33 జిల్లాల నుంచి వడ్డెరులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. కార్యమంలో నాయకులు మారయ్య, శివరాత్రి ఐలమల్లు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు అభివృద్ధి చెందాలి

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 29: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ప్రతినిధి దడువై రాఘవేందర్‌రావు పిలుపునిచ్చారు. లాలాపేట మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రాఘవేందర్‌తో పాటు ఆదం సంతోష్‌కుమార్, ప్రముఖ మెజీషియన్ సామల వేణు, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్, సంఘం అధ్యక్షుడు చిలుక శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మీసాల శ్రీనివాస్, కోశాధికారి కొండమడుగు నాగరాజు, ఉపాధ్యక్షులు చింతల కృష్ణస్వామి, చిలుకూరి వెంకటరావు, సేవెల్లి వెంకటయ్య, గర్ష మోహన్, మాడ ప్రమోద్‌కుమార్, సలహాదారు గుండం పాండురంగం, కార్యదర్శులు చెలిమెల రాజు, పొట్ల చెరువు ముత్యాలు, పార్వతి పరమేశ్, సప్పిడి వెంకటేశ్, ఆకుల లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బేగంపేట్, డిసెంబర్ 29: సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై ట్రాఫిక్ పోలీసులు మరింత వేగం పెంచారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహంకాళి, బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు, షెడ్లను ఆదివారం తొలగించారు. ఐదు రోజులుగా ఆక్రమణలను తొలగిస్తున్నామని ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం సికింద్రాబాద్ సుభాష్ రోడ్డులోని నాగెల్లి దుర్గయ్య ప్రభుత్వ పాఠశాలను ఆనుకొని కొంతమంది ఫుట్‌పాత్, పాఠశాల గోడ స్థలాన్ని ఆక్రమించి ఫుట్‌పాత్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో ట్రాఫిక్ పోలీసులు సుభాష్ రోడ్డులో రోప్‌వే నిర్వహించి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. అలాగే 31బస్టాప్, రాణిగంజ్, ఎంజీ, రోడ్డు, ఆర్పీ రోడ్డుల్లో కూడా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినట్టు ఏసీపీ తెలిపారు. తిరిగి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే తిరిగి తొలగిస్తామని హెచ్చరించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో పాఠశాల స్థల దాతలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సుభాష్ రోడ్డులో పాఠశాల గోడకు ఆనుకొని ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

రెడ్‌హిల్స్ జంగం బస్తీలో బస్తీబాట

మెహిదీపట్నం, డిసెంబర్ 29 : నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లోని జంగం బస్తీలో ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బస్తీ బాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ సొసైటీ జాతీయ అధ్యక్షుడు సిరుగుమల్లె రాజువస్తాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇటీవల సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సభను విజయవంతం చేసిన ప్రజలకు రాజు వస్తాద్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌కుమార్, యశ్వంత్ రావు, ఎ.సుధీర్ కుమార్, క్రాంతికిరణ్, గట్టయ్య, భగవాన్‌దాస్, వినోద్ కుమార్, శశి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీహెచ్ పర్వతాలు, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 29: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంతాప సభ కార్యక్రమాన్ని ఆదివారం బాగ్‌లింగంపల్లి చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి సీహెచ్ పర్వతాలు ఆధ్వర్యంలో నాయకులు శ్యామ్‌యాదవ్, బీఎల్ వర్మ, భూపాల్, రాములుముదిరాజ్, విశ్వనాథ్, అమర్, సాంబల్, జగన్‌యాదవ్ హాజరై దివంగత ప్రధాని చిత్రపటానికి నివాళులర్పించారు.

ఫాసిజంపై అంతర్జాతీయ సెమినార్

చిక్కడపల్లి, డిసెంబర్ 29: అరవింద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్క్సిస్ట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 21వ శతాబ్దంలో ఫాసిజం-కొనసాగుతున్న అంశాలు, నూతన లక్షణాల, సమకాలీన శ్రామికవర్గ వ్యూహం అంశంపై ఐదు రోజుల అంతర్జాతీయ సెమినార్ ప్రారంభించారు. ఈ సెమినార్‌లో వందలాది మంది యాక్టివిస్టులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్మికవర్గ విముక్తి కోసం పోరాడుతూ ప్రాణాలు అర్పించిన అరవింద్‌సింగ్, మీనాక్షి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మార్క్సిస్టు సిద్ధాంతవేత్త మజ్దూర్ బిగుల్ సంపాదకుడు అభినవ్ సిన్హా మాట్లాడారు. నిరంకుశ లక్షణాలున్న పాలనలన్నింటినీ ఫాసిజంగా గుర్తించే దురలవాటును, ఫాసింజం ఒకే రకంగా ముందుకు వస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సత్యం వెర్మ, ఆర్.రఘు, కేజీ రామచంద్రరావు, శివానీకౌల్, డాక్టర్ నిఖిల్ ఏకడే, ప్రేమ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవంత్‌కు సిల్వర్ మెడల్

సీఎం కప్ 2024 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న రేవంత్

సికింద్రాబాద్, డిసెంబర్ 29: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సీతాఫలమండికి చెందిన రేవంత్ 67కిలోల విభాగంలో స్నాచ్ 90 కేజీలు, క్లీన్, జర్క్, 110కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. చీఫ్ మినిస్టర్ కప్‌లో భాగంగా లాల్ బహదూర్ స్టేడియంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ పోటీలు నిర్వహించింది. హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాస్, కోచ్‌లు శివకుమార్, శ్రవణ్, రాజు, హేమలత ఈ సందర్భంగా రేవంత్‌ను అభినందించారు.

కన్నుల పండువగా సంక్రాంతి సంబురాలు

జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మహిళలు

హరిదాసుల సంప్రదాయ వేషధారణలో..

అమీర్‌పేట్, డిసెంబర్ 29: భవిష్యత్ తరాలకు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేసేలా కొత్తపల్లి మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం సనత్‌నగర్ మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాలు ఆవరణలో సంక్రాంతి సంబురాలు జరిగాయి. సంప్రదాయ రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సందడి, సరదాగా కోళ్ల పందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగ విశిష్టతను తెలియజేసే ప్రసంగాలు, చిన్నా పెద్దా అంతా కలిసి భోజనాలు చేయడం వంటి సంక్రాంతి సంబురాల ఆనందాలు మిన్నంటాయి. కేవలం కమ్మ సంఘాల వారే కాక తమ ఆత్మీయులు, శ్రేయోభిలాషులు అంతా విచ్చేసి పండుగ ఆనందంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని నిర్వాహకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు, విజయలక్ష్మి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ విశ్లేషకులు అడుసుమిల్లి శ్రీనివాస్, అతిథులుగా అప్పసాని రాజేశ్, ముప్పా అంకమ్మచౌదరి, ఇనుగంటి లావణ్య, వీరమాచినేని రమేశ్‌బాబులు హాజరయ్యారు.

గంగిరెద్దుల విన్యాసాలు

రిట్ పిటిషన్ కొట్టివేత పట్ల హర్షం

అమీర్‌పేట్, డిసెంబర్ 29: కొంతమంది స్వార్థపూరిత ఆలోచనలతో తెలంగాణ కమ్మ సంఘంపై వేసిన రిట్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేయడం పట్ల కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం సమాఖ్య కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు సీవీ రావు, అధ్యక్షుడు అరికెపూడి గాంధీ, అడుసుమిల్లి వెంకటేశ్వర్‌రావును సమాఖ్య ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రతినిధుల సమావేశంలో కమ్మ సంఘం రాష్ట్ర కమిటీ పూర్తిస్థాయి నిబంధనల మేరకు (బైలా) కొనసాగేందుకు వీలుగా రాష్ట్ర పరిధిలోని 53 కమ్మ సంఘాల కమిటీలు బైలా పద్ధతిన కొనసాగుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించడంతో పాటు మెంబర్‌షిప్ రివ్యూ కమిటీని నియమించారు. సమాఖ్య ప్రతినిధులైన పొట్లూరి పాండుంగరావు, డాక్టర్ పునుకొల్లు నాగభూషణం, చాపరాల శ్రీనివాసదాసు, తాళ్లూరి జీవన్‌కుమార్, పల్లెంపాటి శివన్నారాయణతో కమిటీ వేశారు. మర్చి 31 నాటికి పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని తీర్మానించింది. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలవాలని సమావేశంలో తీర్మినించారు. సమావేశంలో ప్రతినిధులు పునుగొల్లు నాగభూషణం, తాళ్లూరు చంద్రమౌళి, పోలవరపు శ్రీనివాస్‌ప్రసాద్, పాతూరు వెంకట్రావు, పొట్లూరు పాండురగంరావు, ముప్పనేని అప్పారావు, కానూరి ఆంజనేయ వరప్రసాద్, కొల్లి నాగేంద్రరావు, కాజా కాళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వంజరి కులస్తుల సంక్షేమానికి కృషి

గోల్నాక: సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్న వంజరి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం న్యూపటేల్‌నగర్ కమ్యూనిటీ హాల్లో అంబర్‌పేట వంజరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి కరిపె జగన్ మోహన్‌రావు, అంబర్ పేట వంజరి సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుతో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై...ఆ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు డొరె గంగరాజు, వారె బాలకృష్ణ, వంజరి నాగరాజు, భూమన్న, కరిపె చంద్రశేఖర్, విఠల్, రాజశేఖర్, ఎదుగని అశోక్, ఎంకే రాజు, లవంగు నాగరాజు, శంకర్, కాళిదాస్, సాటికె రాజు, పోత్నక్ ప్రకాశ్, పి.శ్రీనివాస్, లక్ష్మణ్, నరేశ్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన వర్గీకరణ జరగాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 29: ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొంద్ర భిక్షపతి డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3న నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మహా భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బౌద్ధనగర్ డివిజన్ న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ ఎస్సీలలోని అన్ని కులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగంలో రిజర్వేషన్లను అంబేద్కర్ పొందుపరిచారని గుర్తు చేశారు. జనాభాకు తగినట్లు మాదిగ, మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. ఇప్పటికైనా సుప్రీం తీర్పు నేపథ్యంలో వర్గీకరణను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుంజూరి విజయ్, గణేశ్, ఎడ్ల రూద్ర, సత్యనారాయణ, శివప్రసాద్, రఘు, దేవేంద్ర, మురళీధర్, సాయికుమార్, మహేశ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని సీజీవో టవర్స్‌లో శ్రీసురభి అకాడమి ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆరట్స్ నిర్వహించిన 10వ అంతర్జాతీయ నృత్యం, సంగీత ఉత్సవం 2024లో పాల్గొన్న యువ కూచిపూడి కళాకారులు.

ఎంఐఎం ఆధ్వర్యంలో నిరసన సభ

మెహిదీపట్నం, డిసెంబర్ 29 : నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్ చింతల్‌బస్తీలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్వాన్, నాంపల్లి, చార్మినార్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, మహ్మద్‌మాజీద్ హుస్సేన్, మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ అఫండి, దళిత నాయకులు సిరుగుమల్లె రాజువస్తాద్, అనిల్,ఎంఐఎం నాయకులు ఆరిఫ్ రిజ్వాన్, జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.